
# అనుకు సంధ్య

అనుకు సంధ్య. సాయంత్రం ఆరుగంటలకే చీకటి కురులిరబోసుకుంటోంది. చలి వణికిస్తోంది. బస్ స్టేషన్ రద్దీగా ఉంది. పల్లెల నుంచి వచ్చే బస్సులు భారంగా, నిండుచూలాల్లా వచ్చి



# కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఆగుతున్నాయ్. కష్టపు కాన్పులో బిడ్డ బయట పడ్డట్టు బాధగా బస్సులోంచి దిగింది 'షబానా'. అంత చలిలోనూ చెమటలు పట్టాయి. మనసంతా ముసిరిన ఆలోచనల్ని నెట్టుకుంటూ బస్స్టాండ్ బయటకు నడిచింది. ఆమె కళ్ళు ఎదురుగా ఉన్న 'మయూరి కేఫ్' కిళ్లీ బంక్ దగ్గర కిషోర్ కోసం వెతుకుతున్నాయి. "కిషోర్ యింకా వచ్చినట్లు లేదు" అనుకుంటూ కిళ్లీబడ్డీ సమీపంలో నిల్చుంది షబానా.

ఈ రోజు 'నా' అనుకున్న వారందర్నీ కాదనుకొంది... తాను నమ్మిన 'కిషోర్'ని తన జీవిత భాగస్వామిని చేసుకునేందుకే. ఒక ప్రక్క సంతోషం మరో ప్రక్క భయం, బాధ... ముప్పిరిగొని గుండె వేగం హెచ్చింది. ఆలోచించే కొద్దీ భవిష్యత్ మబ్బులు కమ్మిన ఆకాశంలో చందమామ లాగుంది. కిషోర్ మీద నమ్మకం చిమ్మ చీకట్లో దీపంలా తన గమ్యానికి దారి చూపిస్తున్నట్లుంది. బహుశా తనది తొందరపాటు చర్యేమో! ఏమో! అంతరంగంలో సుడి తిరిగే ఆలోచనలు పెనుగాలి తాకిడికి ఊగిసలాడే ఏటొడ్డు మానులా వంగి లేస్తూ... వచ్చిపోయే జనాల్తో రోడ్డంతా రద్దీగా ఉంది. ఎటుచూసినా అన్నీ కొత్తముఖాలే! టైం చూసింది. 6-50 అయింది. కాలం చాలా బరువుగా కదులుతోంది. ఈ పాటికి రావాల్సింది... బస్సు మిస్సయ్యాడేమో... ఒకవేళ కిషోర్ రాకపోతే?... తన పరిస్థితి?... అన్నీ సందేహాలే... దిగులు ముఖాన్ని దీపస్తంభంలా నిలబెట్టి, వచ్చే బస్సులకు కళ్లు కాపలాపెట్టి, ఆలోచనాదొంతర్లలో కూరుకుపోయింది షబానా.

"హాయ్! షబా!" భుజాన చేయి వేయడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి, వెనక్కిచూసింది షబానా.

ఎదురుగా సూట్కేస్తో చిరునవ్వుతో కిషోర్. "ఎటు చూస్తున్నావ్... ఇంత పరధ్యానంగా ఉన్నావ్? కదిపేవరకూ కనుక్కోలేకపోయావ్...".

"వచ్చావా మహానుభావా! నేను వేయి కళ్ళతో ఎదురుచూస్తూనే ఉన్నాను. పిల్లిలా చడీచప్పుడూ లేకుండా ఎటునుంచి వచ్చావు?" ఆశ్చర్యంగా అడిగింది షబానా.

"చడీచప్పుడూ లేకపోవడమేమిటి? ట్రాక్టర్లా శబ్దం చేసుకుంటూ ఆగిన ఆటోని చూడలేదా? నేను మార్కెట్ సెంటర్లో బస్సుదిగి, ఆటోలో వచ్చాను. ఎంత నేర్పుగా వచ్చానంటావు? మనవూరి బస్సు నిండా తెలిసినవాళ్ళే... నువ్వేమో నువ్వు పనిచేసే ఊళ్లోంచి వచ్చావు గనుక నీకా ప్రోబ్లమ్ లేదు". పద్మవ్యూహం నుంచి తప్పించుకొచ్చినట్లు ముఖం పెట్టాడు కిషోర్.

"సరే! ఘనకార్యమే చేశావు గానీ... ఇప్పుడేం చేద్దాం? నాకెందుకో భయంగా ఉంది. గుండె వెయ్యి కిలోమీటర్ల వేగంతో కొట్టుకుంటోంది".

భయమెందుకు? నిండామునిగితే చలే ఉండదు. సరిగ్గా ఏడు గంటలకు విజయవాడ బస్సుంది. మా ఫ్రెండ్కి ఫోన్లో మన విషయం అంతా చెప్పాను. మనం వెళ్లేటప్పటికి మనల్ని రిసీవ్ చేసుకోవడానికి అతను బస్టాండులోనే ఉంటాడు. "కమాన్... టైం అయింది" ఆమెకు సైగ చేస్తూ బస్స్టాండ్ వైపుకి నడక సాగించాడు కిషోర్. కిషోర్కి నాలుగడుగుల దూరంలో తల దించుకొని ఫాలో అవుతోంది షబానా.

ఇద్దరూ ఒకరివెంటవొకరు బస్సెక్కి కూర్చున్నప్పటికీ ఇద్దరి కళ్లూ బస్సంతా కలియదిరుగు

తున్నాయి. "తెలిసిన వాళ్లెవరైనా ఉన్నారేమోన ని..." తెలిసిన వారెవరూ కనిపించలేదు. "ప్రాణం కుదుటబడ్డట్టు ఒక్కసారిగా దీర్ఘ శ్వాస పీల్చాదిద్దరూ" ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసు కుంటూ.

బస్ బయలుదేరింది. కిషోర్ పైకి ఎంతో ధైర్యంగా ఉన్నట్టు కనిపిస్తున్నా ఎక్కడో బాధ మెలిబెట్టినట్టు పరిపరివిధాలైన ఆలోచనలు... తనది ఊళ్లో ఉన్నత కుటుంబం. ఈ ప్రేమ పెళ్లికి వాళ్ల పెద్దలు ససేమిరా ఒప్పుకోరు. ఇది ఒక అంతరం కాదు. కులాంతరం, మతాంత రం. షబానా తరుపునా అంతే... కూటికి పేదలైనా గుణానికి, కులానికీ పేదలు కాని కుటుం బం వారిది. తరువాత ఎన్ని గొడవలవుతాయో ఏమో! ఇద్దరివీ ఎదురెదురు ఇండ్లు. కుల మతాలు వేరైనా వారి కుటుంబాల మధ్య పోరా సుల పొత్తులుండేవి. వావి వరుసలతో పిల్చుకు నే అనుబంధం. ఇద్దరివీ వ్యవసాయక కుటుం బాలే! ఇద్దరిండ్లలోనూ చదువుకుంది వీళ్లిద్దరే! షబానా టీచర్. కిషోర్ అగ్రికల్చరల్ ఆఫీసర్. చిన్నతనం నుంచీ యిద్దరిమధ్యా ఓ ఆకర్షణ చిగురించి, వయసుతోటి కొమ్మసాగి యవ్వనం లో మోహమై మొగ్గ తొడిగింది. వారి అనుబంధ పరిమళం రెండు కుటుంబాల పెద్దలకూ దుర్గం ధమైంది. వారు ఒకటయ్యేందుకు రెండు కుటుంబాలూ ససేమిరా అన్నాయి. అందుకే వారు తమ ఆలోచనలకు రూపమిచ్చేందుకు యిలా పారిపోయి పెండ్లి చేసుకోవడమే పరి ష్కారంగా భావించారు.

విజయవాడ బస్‌స్టేషన్‌లో బస్ ఆగింది. స్నేహితుని రాకకోసం ఎదురుచూస్తున్న బల రాం ఆగే బస్‌కి, చేతివాచీకి చూపుల వంతెన కడుతూ బస్ నుంచి దిగే ప్యాసింజర్లను గమ నిస్తున్నాడు. కిషోర్‌ని చూడగానే గుండెల మీద నుంచి పెద్ద బరువును దింపినట్లు ఫీలవుతూ ఒక్క ఉదుటన కిషోర్‌తో చేయి కలిపాడు.

"నిజం చెప్పాలంటే నిరీక్షణకు మించిన శిక్ష లేదోయ్!" అరగంట లేటు ఆరుదినాల్లా అనిపించింది.

"బలరాం... ఈమె షబానా. నా వుడ్‌బీ" షబానా... వీడే నా ఫ్రెండ్ బలరాం" పరిచయ కార్యక్రమం ముగిసింది.

"చక్కని జంట... మనవాడు మతం మార్చు అయినా మంచి అమ్మాయినే సెలెక్ట్ చేసుకొ న్నాడు" మనస్సులో అనుకొన్నాడు బలరాం.

"మీరు కార్పొరేషన్‌లో ఇంజనీరని, మీరు తనకు మంచి స్నేహితులని ఎప్పుడూ చెబుతుం టాడు కిషోర్" మెచ్చుకోలుగా అంది షబానా.


"రండి! మీకోసం హోటల్‌లో రూమ్ బుక్ చేశాను. మీకే యిబ్బందీ ఉండదు. హోటల్ మేనేజర్ నా ఫ్రెండ్. మీరనుకొన్న పని సలక్ష ణంగా జరిగిపోతుంది. మీరు ఒకింటి వాళ్లవ డానికి ఆ హోటల్ మేనేజర్ కూడా తోడ్పడతా డు" హోటల్‌లో ఏ విధమైన భయం లేదనేం దుకు మేనేజర్ స్నేహాన్ని ఆధారంగా చూపించా డు బలరాం.

ఆటో హోటల్ ముందు ఆగింది. ముగ్గురూ ఆటోలోంచి దిగి రిసెప్షన్ దగ్గరకు వెళ్లారు. కౌంటర్లో "డేవిడ్ ఫ్రాంక్లిన్" కుర్చొనున్నాడు.

"హలో! బలరాం! మన ఫ్రండ్స్ వీళ్లేనా?" కొత్త ముఖాల్లోకి చూస్తూ అడిగాడు ఫ్రాంక్లిన్.

"యస్!... మీట్ మిస్టర్ కిషోర్ అండ్ హిజ్ వుడ్‌బి" అంటూ ఫ్రాంక్లిన్‌కి పరిచయం చేశాడు బలరాం.

'గ్లాడ్ టు సీయూ సర్', వినయంగా షేక్ హాండ్ ఇచ్చాడు కిషోర్.




"రూమ్ నెం. 104. నీట్‌గా పెట్టు" అంటూ తాళం చెవి రూమ్‌బాయ్ కిచ్చాడు. "మీరు రూమ్‌కెళ్లి రెస్ట్ తీసుకోండి" క్రీగంట చూస్తూ చిరునవ్వు నవ్వాడు ఫ్రాంక్లిన్.

"రూమ్ చాలా బావుందిరా! నా కోసం చాలా శ్రమ తీసుకొన్నావు! థాంక్స్" కృతజ్ఞతా పూర్వకంగా అన్నాడు కిషోర్.

నూతనంగా కాబోయే దంపతులకు ఆ మాత్రం చేయకుంటే ఎలారా? ఇందులో శ్రమే ముంది?

రూమ్ డోర్ తట్టిన శబ్దమైంది. ప్లీజ్... కమిన్... డోర్ వేసి లేదు రండి!" అన్నాడు బలరాం గట్టిగా.

ఎక్స్‌క్యూజ్‌మీ ఫ్రండ్స్... అంటూ లోనికి వచ్చాడు ఫ్రాంక్లిన్. ఒక విషయం చెబుదామని వచ్చాను. ఈ నైట్ భోజనం ఏర్పాటు చేశాను. బలరాం, నేనూ కలవక చాలా రోజులయింది.

"మీకెందుకులెండి శ్రమ... నేను ఏర్పాటు చేస్తాను. నా స్నేహితుడు రాకరాక వచ్చాడు" కిషోర్‌కేసి చూస్తూ అన్నాడు బలరాం.

"మీరిద్దరూ తేల్చుకోండి... ఎవరు ఆతిధ్య మిచ్చేదీ" తినిపెట్టడానికి మేం రెడీ!" నవ్వుతూ షబానా వంక చూశాడు కిషోర్.

"నాకు ఆకలిలేదు. మజ్జిగ మాత్రం తీసు కుంటాను. మీరు భోంచేయండి!" బాత్‌రూమ్ వైపు నడుస్తూ అంది షబానా.

"కిషోర్‌గారూ మీ ఆవిడ భోంచేయరట. నా రూమ్‌కెళ్లి మనమంతా భోంచేసి, ఆవిడకు మజ్జిగ పంపిద్దాం" తన పర్సనల్ రూమ్‌కి ఆహ్వానిస్తూ అన్నాడు ఫ్రాంక్లిన్.

బలరాంకి ఫ్రాంక్లిన్ మనోగతం ఒక కోణ మే తెలుసు. బలరాం కార్పొరేషన్‌లో ఇంజనీర్ కాబట్టి వచ్చేపోయే పై అధికారులకు మందు పార్టీలు ఏర్పాటుకు తోడ్పడేవాడు ఫ్రాంక్లిన్. నిజంగా ఫ్రాంక్లిన్ 'ఫ్రాంక్' కాదు, 'క్లీన్' కాదు. అతనో కామాంధుడు. అవకాశమెచ్చినప్పుడు,

అదనుదొరికినప్పుడూ అతనిలోని 'శాడిస్టు' మేల్కొంటాడు. మందు పార్టీలు, డిన్నర్ల పేరుతోనే బడాబడా వ్యాపారస్తులను, ఉద్యోగస్థులనూ బుట్టలో వేసుకుంటూ వాళ్ల ద్వారా జరిగే పనులు చేయిస్తూ పార్టీల దగ్గర డబ్బు గుంజుతూంటాడు. చీకటి వ్యాపారాలకు చేయూతగా, అసాంఘిక కార్యకలాపాలకు ఆసరాగా ఉంటూ హోటల్ మేనేజర్‌గా ఫిక్స్ అయిపోయాడు. ఈ రోజు బలరాం అమాయకత్వాన్ని క్యాష్ చేసుకోవాలనుకున్నాడు. తొలిచూపులోనే కిషోర్, షబానా భార్యాభర్తలు కాదని కనిపెట్టాడు. వీలుంటే తన కోరిక తీర్చుకోవచ్చనే ఆశ ఆకలిగొన్న తోడేలులా ఆవులించింది.

అంతా ఫ్రాంక్లిన్ రూమ్‌లోకి ప్రవేశించారు. "సలీం" అంటూ బాయ్‌ని కేకేశాడు ఫ్రాంక్లిన్.

పరిగెత్తుకుంటూ వచ్చాడు సలీం

"మన మిత్రులొచ్చారు. మంచి పార్టీ యివ్వాలి! ఐదు నిమిషాల్లో ఏర్పాట్లు చూడు".

"సరేనయ్యా!" అంటూ సలీం పనిలో నిమగ్నమయ్యాడు.

టీపాయ్ ఎదురుగా ఉన్న కుర్చీలపై బలరాం, ఫ్రాంక్లిన్ కూర్చున్నారు. సోఫాలో కిషోర్ కూర్చున్నాడు.

మందు ఏర్పాట్లు నిమిషాల్లో పూర్తయ్యాయి. "ప్రొద్దుపోయింది. ఇక మొదలెడదామా?" పార్టీకి ఆహ్వానం పలికాడు ఫ్రాంక్లిన్.

"సారీ సర్! నేను ఈ రోజు తీసుకోను... రూమ్‌లో ఆమె... ఒక్కతే ఉంది"... గొణిగాడు కిషోర్ అవకాశాన్ని జారవిడుచుకుంటున్నందుకు బాధ పడుతున్నట్లుగానే...

"అయ్యో! మీరలా అంటే ఏలాగండీ... మీ కోసమే సార్! ఈ ఏర్పాట్లన్నీ! బలరాం రావడం, అందునా ఆయన ఆత్మీయమిత్రుడితో రావడం, మేం పార్టీ చేయకుంటే ఎంత నామర్దాగా ఉంటుంది?" గ్లాసు అందిస్తూ అన్నాడు ఫ్రాంక్లిన్.

"ఫర్వాలేదు లేరా... రెండు రౌండ్స్‌కి లేద్దాం?... మిత్రుడు ఫ్రాంక్లిన్ ప్రాధేయపడుతూంటే కాదంటే బాగోదు! జస్ట్ మన స్నేహితునికి కంపెనీ ఇద్దాం" మొహమాటపెట్టాడు బలరాం.

రెండు... మూడు... నాలుగు రౌండ్స్ పూర్తయ్యాయి. ఐదో రౌండ్ మొదలుపెడుతూ.. ఫ్రాంక్లిన్ సలీంని పిలిచి చెవిలో ఏదో గొణిగి, పెద్దగా 104లో ఓ గ్లాస్ మజ్జిగ ఇచ్చిరారా!" అన్నాడు ఫ్రాంక్లిన్.

కొన్ని బలహీనతలు మనిషిని హీనాతిహీనంగా దిగజారుస్తాయి. ఒక్కసారిగా జీవితాన్ని తారుమారు చేస్తాయి. వ్యసనం ఎంతటివాడినైనా వెర్రివాడిని చేసి ఆటబొమ్మలా ఆడిస్తుంది. అంగడి బొమ్మలా నిలబెడుతుంది.

తాగుబోతు తూలుతున్నా, మత్తులోనే మదిలో దాగున్న నిజాలు నిర్భయంగా బయటికొస్తూంటాయి. నిజం నిష్టూరమైనా లేచి నిలబడగలుగుతుంది.

"నేను ఇంతవరకూ చెప్పలేదు... నా మిత్రుడు కిషోర్ ఈ ఊరొచ్చిన కారణం... అది ఇప్పుడు చెబుతున్నాను ఫ్రాంక్లిన్... రూమ్‌లో ఉన్న అమ్మాయి మా వాడి లవ్వు. వీళ్లిద్దరికీ మనం పెండ్లి చేయాలి. పెండ్లి చేస్తానని నేను మాట ఇచ్చాను. కొండంత అండ ఫ్రాంక్లిన్ బ్రదర్ ఉండగా భయమెందుకని మాట ఇచ్చేశాను. అంతే... ఏమంటావ్ ఫ్రాంక్లిన్?" గర్వంగా చూస్తూ అన్నాడు బలరాం.

"ఓకే... అంటాను మిత్రమా... రేపు సాయంత్రంలోపు మీ స్నేహితుడ్ని ఓ యింటోడ్ని చేసేద్దాం. ఫ్రాంక్లిన్ అంటే స్నేహానికి ప్రాణ

మిస్తాడు" తూలిపోతూ... లేచి నిలబడడానికి ప్రయత్నిస్తున్నాడు ఫ్రాంక్లిన్.

"థాంక్‌యూ సర్ మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను. మాది మతాంతర వివాహం. మీ ఆశీర్వాదం ఉంటే మేం ఒకటవుతాం. ఇక నేను రూమ్‌కి వెళ్తాను" లేచాడు కిషోర్.

☆ ☆ ☆

104 రూమ్ కాలింగ్ బెల్ నొక్కాడు సలీం.

కిషోర్ వచ్చాడని తలుపు తెరిచింది షబానా.

మేడమ్! మజ్జిగ... అంటూ గ్లాస్ టీపాయ్ మీద పెట్టాడు సలీం.

ఆ గొంతు ఎక్కడో విన్నట్లుంది అనుకొంటూ ఒక్కసారి రూమ్‌బాయ్ వైపు చూసింది షబానా.

అంతలోనే సలీం కళ్లూ షబానా వైపు తిరిగాయి.

వారిద్దరికీ ఆశ్చర్యానికి అవధుల్లేవు.

షబానా సలీం స్వంత బాబాయి కూతురు. సలీంది ప్రక్క గ్రామమైనా చిన్నతనంలో బాబాయిగారి యింటి దగ్గరే వ్యవసాయం పనిలో సహాయపడుతూ ఉండేవాడు.

హోటల్‌లో పరాయి మగాడితో చెల్లి... బాగా చదువుకొన్న చెల్లి... ఎప్పుడూ ఇంట్లోంచి ఒంటరిగా బయటికి రాని పిల్ల... ఈ స్థితిలో ఈ విధంగా... తన కళ్లను తానే నమ్మలేకపోయాడు సలీం.

స్పృహ కోల్పోతున్నట్లుంది షబానాకు.

నేను పట్టణం వచ్చి చాలా ఇబ్బందులు పడి, చివరకు బ్రతుకు తెరువు కోసం ఇక్కడ చిక్కుకొన్నాను. ఇదో పెద్ద బోను. ఇక్కడ తిరిగేది పెద్ద మనుషుల వంటి పెద్ద పులులు. ఇక్కడ జరగని ఘోరం, నేరం ఉండదు. వీళ్ల ఆటలకు మేము పావులం. అయినా నువ్వెందుకు వచ్చావు ఇక్కడకు?

"కిషోర్ మన యింటి ఎదురింటి వాళ్లబ్బాయి. అతన్ని ప్రేమించాను. ఇంట్లో మా పెండ్లికి ఒప్పుకోలేదు. పారిపోయి పెండ్లి చేసుకుందామనుకున్నాం. అందుకే ఆయనతో వచ్చేశాను. రేపు గుళ్లో పెండ్లి చేసుకుంటాం. ఆయన స్నేహితులు బలరాం మా పెండ్లికి సహకరిస్తారంట" పాఠం అప్పజెప్పినట్లు చెప్పింది షబానా.

"ఆ తాగుబోతు వెధవను ఎలానమ్మావమ్మా? ఆ రూమ్‌లో మా మేనేజరుగాడు, వాళ్లూ ఎంత విపరీతంగా తాగుతున్నారో ఒక్కసారి వెళ్లి చూడు... వాళ్ల అసలు రూపమేదో తెలుస్తుంది. మా మేనేజర్ ఎంత వెధవో, బడాకోరో నాకు తెలుసు. వాడి అఘాయిత్యాలు రోజూ మేం చూసేవే. వాడికి స్నేహితులంటే వీళ్లూ దొంగ వెధవలే అయిఉంటారు. ఎంత తప్పు చేశావు?"

"ఏంటి బయ్యా నీవనేది? కిషోర్ తాగుతాడా? బలరాం తాగుతాడా? నేను నమ్మలేకపోతున్నాను".

"ఇప్పుడు వస్తాడు నీ కిషోర్... చూద్దువుగానిలే! మా మేనేజర్‌గాడి ప్లాన్ అంతా నాకు చెప్పాడు. అది విన్నావంటే గుండె పగిలి చస్తావు! నీతో వచ్చిన వాళ్ళకు భారీగా తాపించి, ఆ తరువాత నిన్ను వాడి రూమ్‌కి మాయమాటలు చెప్పి తీసుకురమ్మన్నాడు! ఇష్టపడి ఒప్పుకున్నావా సరేసరి లేదా బలవంతంగానైనా నిన్ను పాడుచేయకుండా వాడు వదలడు.

కిషోర్, బలరాం తాగారా? కాళ్ళ క్రింద భూమి గిర్రున తిరిగిపోతోంది. ఆశాసౌధాలు ఒక్కొక్కటే కూలిపోతున్నాయి. కరెంటు పోయి చీకటి ఆవహించినట్లు మనసంతా చిమ్మ చీకటి ఆవహించింది షబానాకు.

ఇప్పుడు ఆలోచించి ప్రమాదాన్నుంచి బయటపడాలేగానీ తీరిగ్గా ఏడ్చే టయమ్ లేదు. నీవన్న కిషోర్ నీ రూమ్ దాకా వస్తే మహా గొప్ప. మేనేజర్ రూమ్‌లోనే సోఫాలో పడి పోయుంటాడు.

"షబానా! మైడియర్ షబానా! ఐయామ్ సారీ డియర్! ఏదో ఫ్రెండ్స్ బలవంతం చేస్తే కొంచెం తాగా... అంతే... కొంచెం అంటే కొంచెం... మన పెండ్లి పెద్దల మాట గౌరవించాలి కదా... నీవేం అనుకోవు కదా..." తూలుతూ గదిలోకొచ్చాడు కిషోర్.

జీవితంలో తప్పటడుగు వేశాడు కిషోర్. తాగిన తప్పటడుగు కాదది.

షబానా ఒక్కసారి నిశ్చేష్టురాలైంది.

"కిషోర్! నీవు తాగావా? ఈ రోజు నన్ను నమ్మించి తీసుకొచ్చి పరాయి ఊళ్లో ఏ అండా లేని చోట నన్ను ఒంటరిగా నా ఖర్మకు వదిలేసి, నీవు నీ వ్యసనానికి దాసుడవవుతావా? ఇదే నా... నా మీద ప్రేమ? నన్ను జీవితాంతం గుండెల్లో పెట్టి దాచుకొనే పద్ధతి ఇదేనా?" ఉబికొచ్చే కన్నీళ్లు వత్తుకుంటోంది షబానా.

డోంట్ వర్రీ డియర్... నీ మీద నాకు ప్రేమ లేక కాదు. మన ప్రేమ ఫలించడానికే తాగాను. చాలా పొద్దుపోయింది... డోర్‌వేసి వచ్చిపడుకో. తెల్లవారే మన పెండ్లి! 'ఒరేయ్! నువ్వు వెళ్లిపోరా సలీం!... బెడ్‌మీద అడ్డంగా పడిపోయాడు కిషోర్.

భయపడకు షబానా! నేనున్నాను కదా! నా ప్రాణం అడ్డేసైనా నిన్ను కాపాడుతాను. బాబాయికి నిన్ను అప్పగిస్తాను. మా మేనేజర్ గాడు ఏం చేస్తున్నాడో చూసొస్తాను. నీవు జాగ్రత్తగా తలుపేసుకో!

షబానాకు ఏం చేయాలో తోచడం లేదు. అన్న సలీం దేవుడిలా తోడు కావడం అదృష్టం గా భావించింది. ప్రవాహంలో కొట్టుకుపోయే వాడికి చెట్టుకొమ్మ దొరికినట్లయింది.

ఫ్రాంక్లిన్ రూమ్‌లోకి వెళ్లాడు సలీం. ఓరేయ్... కిషోర్‌గాడు నిద్రపోయాడా? వీడు, బలరాంగాడూ రేపు 10 గంటల దాకా లేవరు. దానితో మన విషయం మాట్లాడావా? ఒప్పుకుందా? లేక మోరాయిస్తోందా? ప్రశ్నల వర్షానికి గుండె తూట్లు పడుతున్నాయి సలీంకి.

"అంతా మాట్లాడానయ్యా, ఒప్పుకుంది. కాకపోతే ఇంకో రెండు గంటలుపోతే అంతా గప్‌చిప్‌గా నిద్రోతారు... ఆ తరువాత మీ రూమ్‌కి వస్తానంది" రోజూ జరిగే తార్పుడు వ్యవహారం ఏకరువుపెట్టాడు సలీం.

అయితే నేనూ నిద్దరోతాను. సరిగ్గా రెండు గంటలకు లేపు. నాకు నిషాగా ఉంది... అంటూ సోఫాలో అడ్డం పడ్డాడు ఫ్రాంక్లిన్.

అదను బాగా దొరికింది... ఫ్రాంక్లిన్ టేబుల్ సొరుగులో ఉన్న గేటు తాళం చెవి తీసుకున్నాడు సలీం. ఒక్క ఉదుటన షబానా రూమ్‌కి వచ్చి "ఇక బయలుదేరు షబానా... లేట్ చేసావంటే ఈ నా కొడుకులు మేల్కొంటారు. మన ఇద్దరికీ బంధుత్వం ఉందని తెలిస్తే నన్ను చంపేస్తాడు మా మేనేజర్. నిన్నూ చెరుస్తాడు అంటూ షబానా చెయ్యి పట్టుకొని నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ హోటల్ మెయిన్‌గేటు దాటారు.

కిషోర్ తెల్లవారగానే నిద్రలేచాడు. తాను హోటల్ రూమ్‌లో ఉన్న సంగతి అప్పుడు గుర్తొచ్చింది. బలరాం అప్పుడే రూమ్‌లోకి అడుగు పెడుతూ "నిద్ర సరిగ్గా పట్టిందా కొత్త జంటకు" అంటున్నాడు. హాయిగా నిద్రపోయా! షబానా ఏది? బాత్‌రూమ్‌లోకి వెళ్లినట్లుంది. కూర్చో

రా... అంటూ మర్యాద చేయసాగాడు కిషోర్.

అర్థగంట గడిచింది. షబానా అలికిడి విని పించలేదు. "షబా, షబా" అంటూ పిలిచాడు కిషోర్. నిశ్శబ్దమే సమాధానం. "ఏది? నా షబా ఏమైంది? కనిపించడంలేదు... కొంప ముని గింది... ఎవడన్నా ఏ అఘాయిత్యమైనా చేసుంటాడేమో! నేను తాగిన మైకంలో పడి ఉన్నాను" అంటూ అత్రుతగా అటూ ఇటూ తిరుగుతున్నాడు కిషోర్. కంగారు పడిపోతు న్నాడు - "ఒరేయ్ బలరాం కొంపమునిగింది రా! నా షబానా కనిపించడం లేదు..." పెద్దగా అరుస్తూ జుట్టు పీక్కుంటున్నాడు.

"రూమ్‌బాయ్ సలీంగాడు ఇటొచ్చాడా? అడో పెద్ద దొంగ నాకొడుకు... డాఫర్ నాకొడు కు..." అంటూ అటుగా వచ్చాడు ఫ్రాంక్లిన్.

"నా షబానా కనుపించడం లేదు సార్! ఆమె ఎక్కడికి పోయిందో ఏమోమరి" కళ్లనీళ్ల పర్యంతమయ్యాడు కిషోర్.

"సలీంగాడు కూడా కనిపించడం లేదు బ్రదర్. ఆడో పెద్ద తార్పుడు నాకొడుకు. దానిని ఏ రూమ్‌లోకి తార్చిఉంటాడో ఏమో? కొద్ది సేపటికి వస్తుందిలే... భయపడకు?" నిర్లక్ష్యం గా మాట్లాడుతున్న ఫ్రాంక్లిన్‌ని చూస్తూంటే ఇద్దరి మిత్రులకూ తలలు తిరిగినట్లయింది. -వీడి నిజస్వరూపం ఇదా? రాత్రి ఎంత విన యంగా, మర్యాదగా మాట్లాడాడు?" ఇప్పుడు ఈ విధంగా మాట్లాడుతున్నాడు". "ఫ్రండ్స్ అనే విచక్షణ కూడా లేకుండా" తలదించుకున్నారు మిత్రులిద్దరూ.

కిశోర్‌కి ఏంచేయాలో అర్థం కావడం లేదు. ఎలా యింటికి పోవాలో తెలియడంలేదు. మా అమ్మాయిని ఏంచేశావని మౌలాలీ అంకుల్ నిలదీస్తే ఏం చెప్పాలి? ఎన్నో ప్రశ్నలు! ఒక్క దానికీ సమాధానం తనవద్ద లేదు.

బలరాం బాగా ఆలోచించి చివరకు మిత్రు నికి ఓ ఉచిత సలహా ఇచ్చాడు. "కిషోర్ నీవు తిన్నగా ఇంటికెళ్లు... నీతో ఆ అమ్మాయి వచ్చిం ది ఎవ్వరికీ తెలీదు. ఆమె క్యారెక్టర్ నీవనుకు న్నంత మంచిదికానట్టుంది. సలీంగాడు కనిపిం చలేదు, షబానా కనిపించలేదంటే వాడు తప్ప నిసరిగా ఆమెను ఏ రూమ్‌కో తీసుకెళ్లి ఉంటా డు. ఉదయాన్నే ఆమె వాళ్ల ఇల్లు ఎట్టానూ చేరుతుంది. నీవు మాత్రం ప్రేమ, దోమా అంటూ దానిని మాత్రం పెండ్లి చేసుకోవద్దు" అంటూ లేడీస్ సైకాలజీ తెలిసినట్టు ఫోజు పెట్టాడు బలరాం.

తనకు తెలియకుండా షబానా అదృశ్యమై నందుకు ఓ ప్రక్క అవమానం, మరో ప్రక్క అనుమానం పెనుభూతాలై వెంటాడుతున్నాయి. చేసేది ఏమీలేక షబానా శీలాన్ని శంకిస్తూ తృప్తి పడి ఇంటిదారిపట్టాడు కిషోర్.

నమ్మకం, అపనమ్మకం కలసి అనుమానపు అనుకుసంధ్యెంది. అది వెలుగు చీకటి కల యిక. వెలుగును తరుముతున్న చీకటి. సాయం త్రం అయింది. బస్సు దిగి కిషోర్ ఇంట్లోకి అడుగుపెట్టాడు. ఒక్కసారి వెనుతిరిగి షబానా ఇంటివైపు చూసాడు. తనకళ్లను తానే నమ్మలేక పోయాడు. "బయ్యా కాఫీ" అంటూ కాఫీ గ్లాస్‌తో 'షబానా', ప్రక్కనే మౌలాలీతో మాట్లాడుతున్న సలీం కాఫీ గ్లాస్ అందుకొంటున్నాడు.

కిషోర్‌కి ఎవడో గుండెల్లో బాకుతో గుచ్చి నట్టుంది. చేతులారా రత్నాన్ని జారవిడచుకొ న్నట్లు, వ్యసనానికి బానిసైనందుకు జీవితాం తం చీకటి జ్ఞాపకాలు తెరలు తెరలుగా వెంటా డుతూనే ఉన్నట్లు... అనుకుసంధ్యలో అంతా అయోమయంగానే ఉంది.